ఈ వృద్ధితో ఉద్యోగాలు పుట్టవ్

దేశ జీడీపీ ఇంకా పెరిగితేనే కొత్త కొలువులు • ఆర్బీఐ మాజీ గవర్నర్ రాజన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఇటీవలికాలంలో బలహీనపడ్డ భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇప్పటికే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ, ఇంకో వైపు ఆయా రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇదే అంచనాల్ని వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారి జీడీపీ వృద్ధిరేటు అంచనాలను కూడా పెంచుతున్నాయి. అయితే ఈ అంచనాలు ఏమంత గొప్పగా లేవని రాజన్ పెదవి విరిచారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజన్.. తాజాగా ఓ బ్లూంబర్గ్ టెలివిజన్ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. దేశ జీడీపీ గాడినపడుతున్నదని ఆనందించాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్న వృద్ధి అంచనాలు.. కొత్తగా జాబ్ మార్కెట్‌లోకి రాబోయే వాళ్లకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేవని తేల్చిచెప్పారు.

ఇంకో 2 శాతం పెరగాలి

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6 శాతానికిపైగానే ఉంటుందన్న అంచనాలు విస్తృతంగా వస్తున్న సంగతి విదితమే. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు సైతం ఇదే చెప్పారు. జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే (నాడు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిని తాకుతూ 5.4 శాతంగా నమోదైంది) ఇది ఎక్కువే. అయినప్పటికీ భారత్ ఇంకా మెరుగైన వృద్ధిరేటును సాధించవచ్చని రాజన్ అభిప్రాయపడ్డారు. ఇంకో 2 శాతం పెరిగి 8 శాతం స్థాయిని అందుకోవాలని, అప్పుడే ఏటా మార్కెట్‌లోకి వస్తున్న నిరుద్యోగ యువతకు తగ్గ ఉద్యోగావకాశాలను సృష్టించగలమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన భారత్‌కు ఇప్పుడున్న స్థాయి వృద్ధి సరికాదన్నారు. కాగా, ఈ శుక్రవారం అక్టోబర్-డిసెంబర్‌కుగాను దేశ జీడీపీ గణాంకాలు అధికారికంగా విడుదల కానున్నాయి.

వడ్డీరేట్లు తగ్గిస్తే చాలదు

మందగించిన దేశ జీడీపీ వృద్ధిరేటును పరుగులు పెట్టించేందుకు దాదాపు ఐదేండ్ల తర్వాత ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీరేటును పావు శాతం కోత పెట్టినది తెలిసిందే. ఈ నెలారంభంలో కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా రెపో రేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తెచ్చారు. దీంతో ఆయా బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. అయితే ఎకానమీని బలపర్చేందుకు ఈ నిర్ణయం ఒక్కటే చాలదని రాజన్ వ్యాఖ్యానించారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి దోహదం చేసే చర్యలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. ఉద్యోగావకాశాలు ఎంతగా పెరిగితే ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు అంత గట్టిగా సాగుతున్నట్టవుతుందన్నారు.

ట్రంప్ టారీఫ్‌లపై..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తు,సేవలపై అధిక సుంకాలను ప్రకటిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ కారణంగానే దేశీయ స్టాక్ మార్కెట్లు సైతం తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. అయితే ఈ సుంకాలపై రాజన్ స్పందిస్తూ.. అమెరికాతో సత్సంబంధాలు లాభదాయకమని, ఆ దేశం నుంచి చమురు, రక్షణపరమైన కొనుగోళ్లను పెంచడం మంచిదని అభిప్రాయపడ్డారు. అలాగే చాలా వస్తూత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించే వీలుందన్నారు. నిజానికి దీనివల్ల దేశ వృద్ధిరేటు ప్రగతికి వచ్చే నష్టమేమీ లేదన్న ఆయన.. పైగా పరిశ్రమలో పోటీ వాతావరణం నెలకొంటుందని, అది మంచిదేనని వ్యాఖ్యానించారు. ఇక ఆర్బీఐ గవర్నర్‌గా 2013 నుంచి 2016 వరకు రాజన్ పనిచేశారు.

హైదరాబాద్ బీఈ యూనిట్ విస్తరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 25: ప్రముఖ ఫార్మా సంస్థ బయోలాజికల్ లిమిటెడ్(బీఈ)..తక్కువ, మధ్యస్థాయి ఆదాయం కలిగిన దేశాల్లో చికెన్‌గున్యా వ్యాక్సిన్‌ను అందించడానికి బవేరియన్ నార్డిక్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ వ్యూహాత్మక ఒప్పందంలో భాగంగా చికెన్‌గున్యా వ్యాక్సిన్ తయారు చేయడానికి వినియోగించే టెక్నాలజీని ఇరు సంస్థలు పంచుకోనున్నాయి. ఈ వ్యాక్సిన్‌ను తయారు చేయడానికి హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీలో ఉన్న ప్లాంట్‌ను ఆధునీకరించనున్నట్లు బీఈ లిమిటెడ్ ఎండీ మహిమా దాట్లా తెలిపారు. దీంతో కొత్తగా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఎంతమేర పెట్టుబడులు పెట్టనున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. అంతర్జాతీయ దేశాల్లో చికెన్‌గున్యా వ్యాక్సిన్ అందించాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు బవేరియన్ నార్డిక్ ప్రెసిడెంట్, సీఈవో పాల్ చాప్లిన్ తెలిపారు.

హైదరాబాద్‌లో ప్రోజో రెండు గిడ్డంగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: దక్షిణ భారతంలో వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో ఒకేసారి రెండు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ప్రారంభించింది ప్రోజో. 82 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్లతో క్లయింట్లకు వేగవంతమైన సేవలు అందించడానికి వీలు పడనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో సంస్థకు తెలంగాణలో 10 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లువుండగా, అదే దేశవ్యాప్తంగా 40 ఉన్నాయి.

రివోల్ట్ మరో బైకు

- ధర రూ.1.15 లక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విద్యుత్‌తో నడిచే వాహనాల తయారీ సంస్థ రివోల్ట్ మోటర్స్ ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్‌వీ బ్లేజెక్స్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధర రూ.1.15 లక్షలుగా నిర్ణయించింది. 3.24 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దిన ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 150 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. రూ.500 చెల్లించి బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు వచ్చే నెల నుంచి డెలివరీ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ బైకుపై మూడేండ్లు లేదా 45 వేల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. గంటకు 85 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోవచ్చును. కేవలం 80 నిమిషాల్లోనే 80 శాతం బ్యాటరీ రీచార్జికానున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200 విక్రయ అవుట్‌లెట్లు ఉండగా, ఈ ఏడాది చివరినాటికి వీటిని 500కి పెంచుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రంలో మెగా డ్రై పోర్టు

ప్రత్యేక రైలు, రోడ్డు మార్గాలతో ఏపీ సీ పోర్టుకు అనుసంధానం

సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి.. బయోఏషియా-2025 సదస్సు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ భూ పరివేష్టిత రాష్ట్రం. అందుకే ఇక్కడ ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి.. దానికి ఆంధ్రప్రదేశ్‌లోని సీ పోర్ట్‌కు అనుసంధానం ఉండేలా ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు అభివృద్ధి చేస్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బయో సైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధిపర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. బయోఏషియా-2025 వార్షిక సదస్సును మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయో ఏషియా సదస్సు హైదరాబాద్‌ను ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందన్నారు. హెల్త్‌కేర్ రంగంలో ప్రపంచానికి మార్గదర్శనం చేసే కార్యక్రమంగా బయోఏషియా సదస్సు నిలుస్తున్నదన్నారు.

ట్రిలియన్ డాలర్లకు..

ప్రపంచంలో పేరొందిన ఫార్మా కంపెనీలు, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్ మరియు బయో టెక్ కంపెనీలెన్నో హైదరాబాద్ నుంచి పని చేస్తున్నాయని, రాబోయే పదేండ్లలో తెలంగాణను ఒక ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ వేదికపై మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నామన్న ఆయన.. గత 25 సంవత్సరాలలో హైదరాబాద్.. ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా పేరుగాంచిందన్నారు. కాగా, జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

క్వీన్స్‌లాండ్ ప్రతినిధులతో సమావేశం..

ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్ స్టేట్ ప్రతినిధులతో హైచ్ఐసీసీలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పరిశ్రమలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ట్రేడింగ్, ఇతర రంగాల్లో పెట్టుబడులు, ఒప్పందాలపై చర్చించారు. వారు సానుకూలంగా స్పందించారు.

ఎట్టకేలకు లాభాల్లోకి సూచీలు

సెన్సెక్స్ 148 పాయింట్లు వృద్ధి

ముంబై, ఫిబ్రవరి 25: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వరుసగా ఐదు రోజులుగా పతనమైన సూచీలకు ఫైనాన్షియల్, ఎఫ్ఎంసీజీ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో 300 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 147.71 పాయింట్ల లాభంతో 74,602 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ మాత్రం వరుసగా ఆరోరోజూ నష్టపోయింది. 5.80 పాయింట్లు కోల్పోయి 22,547.55 వద్దకు జారుకున్నది. ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సూచీ తగ్గుముఖం పట్టింది. మార్కెట్లో మహీంద్రా అండ్ మహీంద్రా 2.61 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్ 2.55 శాతం బలపడింది. దీంతో పాటు జొమాటో, నెస్లె, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, సన్ ఫార్మా, పవర్ గ్రిడ్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా మోటర్స్ షేర్లు నష్టపోయాయి. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు లేదా 2 శాతం మేర నష్టపోయిన విషయం తెలిసిందే.

ప్రైవేటుకు 13 ఎయిర్‌పోర్టులు?

వచ్చే ఏడాది మార్చికల్లా అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: విమానాశ్రయాల ప్రైవేటీకరణను మోదీ సర్కారు మళ్లీ మొదలుపెట్టింది. ప్రభుత్వ ఆస్తుల నగదీకరణ నుంచి పెద్ద ఎత్తున ఆదాయాన్ని పొందాలన్న లక్ష్యం పెట్టుకున్న కేంద్రం.. ఏకంగా వచ్చే ఏడాది మార్చికల్లా దేశంలోని 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని ఇంటర్-మినిస్టీరియల్ కన్సల్టేషన్‌లో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు కూడా చెప్తున్నారు.

ఇదీ సంగతి..

జాతీయ నగదీకరణ ప్రణాళిక కింద 2022 నుంచి 2025 వరకు మొత్తం దేశవ్యాప్తంగా 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌పరం చేయాలని కేంద్రం నిర్ణయించుకున్నది. వీటిలో భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయ్‌పూర్, కాలీకట్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, పాట్నా, మధురై, సూరత్, జోధ్‌పూర్, రాంచీ, చెన్నై, విజయవాడ, రాజమండ్రి, వడోదర, భోపాల్, తిరుపతి, హుబ్లీ, ఇంఫాల్, అగర్తల, డెహ్రాడూన్, ఉదయ్‌పూర్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ముందుగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బోర్డు (ఏఏఐ) 13 ఎయిర్‌పోర్టులను గుర్తించింది. దీంతో వీటి ప్రైవేటీకరణకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కేబినెట్ అనుమతికి సిద్ధమైంది. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. రాయ్‌పూర్, ఇండోర్ విమానాశ్రయాల ప్రైవేటీకరణకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో సదరు జాబితా 11 ఎయిర్‌పోర్టులకు తగ్గింది. ఈలోగా గత ఏడాది లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడింది. కానీ మూడోసారీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరడంతో ఇప్పుడిక మళ్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణపై సర్కారు పెద్దలు దృష్టి సారించారు.

విమర్శలు వస్తున్నా..

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై రాష్ట్రాల నుంచి గట్టిగానే విమర్శలు వస్తున్నాయి. లాభాల్లో ఉన్న విమానాశ్రయాలు ఈ దెబ్బతో నష్టాల్లోకి జారుకుంటాయని, ప్రైవేట్ రంగంలో కొన్ని బడా కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యంలోకి దేశీయ విమానయాన పరిశ్రమ వెళ్లిపోతుందన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ప్యాసింజర్లపై అనవసరపు చార్జీలు వచ్చిపడతాయని, పారదర్శకత లోపిస్తుందని అంటున్నారు. ముఖ్యంగా అదానీ గ్రూప్ కోసమే ఈ ప్రైవేటీకరణ తంతు అన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఇక ఇప్పటికే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో.. రాబోయే ఐదేండ్లలో ప్రభుత్వ ఆస్తులను అమ్మి రూ.10 లక్షల కోట్లను ఖజానాకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ తిరిగి పట్టాలెక్కుతున్నది. ఇదిలావుంటే ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా తొలిసారి 6 పెద్ద ఎయిర్‌పోర్టులతో 7 చిన్న ఎయిర్‌పోర్టులను కలిపేయాలని భావిస్తున్నారు. వారణాసితో ఖుషీనగర్-గయా, అమృత్‌సర్‌తో కంగ్రా, భువనేశ్వర్‌తో తిరుపతి, రాయ్‌పూర్‌తో ఔరంగాబాద్, ఇండోర్‌తో జబల్‌పూర్, తిరుచిరాపల్లితో హుబ్లీ క్లబ్ చేయాలని చూస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆర్థిక సహాయం అందజేస్తున్న భారత జాగృతి నాయకులు

సిరికొండ, ఫిబ్రవరి 25: మండల కేంద్రానికి చెందిన బోధనపు ప్రభాకర్ వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని జాగృతి మండల నాయకులు భారత జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వెంటనే స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులకు జాగృతి నాయకులు మంగళవారం అందజేశారు. జాగృతి రూరల్ కన్వీనర్ మల్లెల సాయిచరణ్, నాయకులు భూపతి, పులి రెడ్డి, భాను, భరత్, వినోద్, పెద్దసాయిలు, నరేశ్ పాల్గొన్నారు.

వృద్ధురాలిని కొట్టిన కేసులో నిందితులకు జైలు

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 25: వృద్ధురాలిని కొట్టి, గాయపర్చిన కేసులో నిందితులకు జైలు శిక్ష పడిందని పోలీసులు తెలిపారు. మోస్రా గ్రామానికి చెందిన చెందిన వృద్ధురాలు, ఆమె కుమారుడిని 2018వ సంవత్సరంలో నలుగురు కలిసి గాయపరిచారు. ఈ కేసులో నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. బోధన్ అడిషనల్ జడ్జి సాయిశివ నిందితులపై నేరం రుజువు కావడంతో పది నెలల జైలు శిక్ష, ఆరు వేల రూపాయల జరిమానా విధించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనలు వినిపించారు. సాక్షులను ఎస్సై గోకల రమేశ్, కోర్టు కానిస్టేబుల్ నాగభూషణం ప్రవేశ పెట్టారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 25: మోస్రా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దా ర్ శాంత మంగళవా రం పరిశీలించారు. ఈనెల 27వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించినట్లు తెలిపారు. నాయబ్ తహసీల్దార్ ఆసియా ఫాతీమా, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

లీకేజీకి మరమ్మతు

పోతంగల్, ఫిబ్రవరి 25: మండల కేంద్రం పోతంగల్‌లో హంగర్గా వెళ్లే మార్గంలో వెల్డింగ్ షాపు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి నీరు లీకవుతున్నది. ఎండాకాలం కావడంతో సమస్య తలెత్తుతుందని నమస్తే తెలంగాణ హెచ్చరించింది. ఈ విషయమై నమస్తే తెలంగాణలో 'వృథాగా మిషన్ భగీరథ నీరు.. అసలే ఎండాకాలం ఇటు వైపు చూడండి సారూ..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి మరమ్మతు చేయించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సూపర్‌వైజర్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

పోతంగల్, ఫిబ్రవరి 25: మండలంలోని ఎస్సీ కాలనీకి చెందిన పద్మ శీల మంగళవారం పురిటి నొప్పులతో బాధపడుతున్నది. దీంతో కుటుబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకొని, ఆమెను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమై ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని బోధన్ దవాఖానలో చేర్పించామని ఈఎంటీ నాగరాణి, పైలట్ కరణ్, కృష్ణ తెలిపారు.

'అక్రమంగా ఇసుక తరలిస్తే ప్రశ్నించొద్దా?'

- అసత్య ఆరోపణలు చేసే ఊరుకోం
- బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక

మోర్తాడ్, ఫిబ్రవరి 25: అధికారపార్టీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తే ప్రశ్నించే అధికారం తమకు లేదా అని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పర్స దేవన్న, దోన్‌పాల్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్యాల లక్ష్మణ్ అన్నారు. మంగళవారం వారు దోన్‌పాల్‌లో విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలు పెట్టి ఇసుక తరలిస్తే తప్పు కాదా అని కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నించారు. చలానాలు చెల్లించకుండా, వేబిల్లులు లేకుండా ఇసుక తీసుకెళ్లడం, గాండ్లపేట్‌లో గ్రామ అభివృద్ధి కమిటీకి రూ.18లక్షలు చెల్లించి, మోర్తాడ్ వారికి రూ.5లక్షల జరిమానా కట్టింది మీరు కాదా అన్ని ప్రశ్నించారు. అక్రమంగా ఇసుక తరలిస్తూ బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్రిప్పుకు రూ.900 చలానా కట్టి అనుమతి తీసుకుని ఇసుక తరలించినట్లు గుర్తు చేశారు. అభివృద్ధిపై బీఆర్ఎస్ దృష్టి సారించిందని, కానీ కాంగ్రెస్ నాయకులు కేవలం ఇసుక వాగులపైనే దృష్టి సారిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్‌పై అవాకులు చెవాకులు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ రమేశ్, పర్స గంగాధర్, ముత్యాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

అలరించిన నృత్యాలు

బోధన్ రూరల్/ బాల్కొండ/ భీమ్‌గల్/ధర్పల్లి, ఫిబ్రవరి 25: బోధన్ మండలం ఎరాజ్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బోధన్ ఎంఈవో నాగయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. బాల్కొండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పదో తరగతి అనేది జీవితంలో తొలి మెట్టు లాంటిదని పరీక్షలు బాగా రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఎరాజ్‌పల్లిలో విద్యార్థినుల నృత్యాలు

భీమ్‌గల్‌లో నృత్యం చేస్తున్న కళాశాల విద్యార్థినులు

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనాథ్ మాట్లాడుతూ ఇంటర్ దశ విద్యార్థులకు ఎంతో కీలకమని, విద్యార్థులు మొబైళ్లు, సోషల్ మీడియాకు బానిస కావొద్దని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ రజీయొద్దీన్ అస్లాం, అధ్యాపకులు ప్రసన్నజ్యోతి, హరిత, జయలక్ష్మి, అరుణ, సురేశ్‌బాబు, వరుణ్‌కుమార్, మహేశ్‌కుమార్, చిన్నబాలయ్య, విఠల్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్పల్లిలో..

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- భర్త, అత్తలే కారణమంటూ మృతురాలి తల్లి ఫిర్యాదు

నవీపేట్, ఫిబ్రవరి 25: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బోదాసు కీర్తి అనే వివాహిత నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. తన కుమార్తె మృతికి తన అల్లుడు బోదాసు వినోద్ కుమార్, అతని తల్లులు ఒడ్డెమ్మ, రాగవ్వ, అతనితో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ మహిళ కారణమని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ జిల్లా చేగుంట గ్రామానికి చెందిన కీర్తిని నవీపేట్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన బోదాసుకు ఇచ్చి సుమారు ఎనిమిదేండ్ల క్రితం వివాహం చేశారు. వివాహంలో రూ.రెండు లక్షల నగదుతోపాటు ఐదు తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు ఏడాది నుంచి అదనంగా రూ.లక్ష తేవాలంటూ కీర్తిని తన భర్త వినోద్ కుమార్ నిత్యం మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. పలుమార్లు రెండు గ్రామాలకు చెందిన కుల పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి నచ్చజెప్పి కీర్తిని కాపురానికి పంపారు. సుమారు పదిహేను రోజుల క్రితం కీర్తితో ఆమె భర్త గొడవపడి కొట్టడంతో ఆమె పిల్లలను ధర్మారంలో వదిలి చేగుంటలోని తన తల్లి వద్దకు వెళ్లింది. పిల్లలపై ప్రేమతో ఐదు రోజుల క్రితం అత్తవారింటికి వెళ్లింది. ఆ సమయంలో వినోద్ కుమార్ మరో మహిళతో కలిసి ఉండడాన్ని కీర్తి చూసింది. వినోద్‌ను ప్రశ్నించగా కీర్తిని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని, లేని పక్షంలో తానే తాగిస్తానని బెదిరించాడు. దీంతో తన కీర్తి పురుగుల మందు తాగి తన రెండో సోదరి యాదమ్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. కీర్తిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. మృతురాలి తల్లి ఎల్లవ్వ తన కుటుంబీకులతో కలిసి దవాఖానకు చేరుకుంది. కీర్తి సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి - మరొకరి పరిస్థితి విషమం

రెంజల్ (శక్కర్‌నగర్), ఫిబ్రవరి 25: రెంజల్ మండలం కందకుర్తి గోదావరి వంతెన వద్ద పోలీస్ అవుట్‌పోస్ట్ మహారాష్ట్ర రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సాటాపూర్‌కు చెందిన మాసునూరి గంగారాం అలియాస్ దెబ్బడి గంగారాం (59), లడ్డు అలియాస్ హనుమంతు అనే వ్యక్తులు మహారాష్ట్రలో తమ డోలక్‌ను రిపేర్ చేయించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నారు. ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టింది. గంగారాం అక్కడికక్కడే మృతి చెందగా, లడ్డుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 ద్వారా బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బోధన్ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం సదరు వ్యక్తిని నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

మెట్లపై నుంచి పడి ఒకరి మృతి

మాక్లూర్(నందిపేట్), ఫిబ్రవరి 25: మద్యం మత్తులో మెట్లపై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు నందిపేట్ ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. నందిపేట్ మండల కేంద్రానికి చెందిన గొల్ల చిన్న ముత్యం (25) లేబర్ పని చేసుకుంటూ ఒంటరిగా జీవించేవాడు. ఈనెల 24న రాత్రి సుమారు 9 గంటలకు రాజ్‌నగర్ దుబ్బలోని కల్లుబట్టిలో కల్లు తాగాడు. మళ్లీ మద్యం తాగేందుకు లిక్కర్ బాటిల్ తీసుకుని కల్లుబట్టి వెనకాల ఉన్న నర్సాగౌడ్ దాబా పైకి ఎక్కి ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి కాలు జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రెంజల్ (శక్కర్‌నగర్), ఫిబ్రవరి 25: రెంజల్ మండలం తాడ్‌బిలోలీ గ్రామానికి చెందిన సాకిన్‌గారి పోశెట్టి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 20వ తేదీన తన కుటుంబీకులతో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రించిన పోశెట్టి ఉదయం కనిపించలేదు. దీంతో అతని కుమారుడు బంధువుల ఇండ్లలో, పలు ప్రాంతాల్లో గాలించాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోశెట్టి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బోధన్ రూరల్, ఫిబ్రవరి 25: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. బోధన్ మండలం సిద్దపూర్ గ్రామం నుంచి ఒక ట్రాక్టర్, సాలూరా మండలం హున్సా గ్రామం నుంచి ఒక ట్రాక్టర్ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

మారుతీనగర్ కాలనీలో చోరీ

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 25: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన నగర శివారులోని మారుతీనగర్‌లో చోటుచేసుకున్నది. రూరల్ ఎస్సై మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన రఘునాథ్ పవార్ ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి డ్యూటీలో తిరుపతికి వెళ్లాడు. ఆయన భార్య ముంబైలో ఉంటున్న ఆమె కూతురు వద్దకు వెళ్లింది. గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలోని ఐదు తులాల బంగారు నగలు దోచుకుపోయారు. మంగళవారం డ్యూటీ నుంచి వచ్చిన రఘునాథ్ పవార్ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..

మాక్లూర్, ఫిబ్రవరి25: మండలంలోని వల్లభపూర్ గ్రామానికి చెందిన సాకలి సాయమ్మ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సాయమ్మ వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఆర్మూర్‌లో ఉన్న తన కూతురి ఇంటికి వెళ్లింది. మంగళవారం తాళం పగులకొట్టి ఉన్న తలుపులను చూసి ఇంటి పక్క వారు బాధితురాలికి సమాచారం అందించారు. ఆర్మూర్ నుంచి వచ్చిన ఆమె ఇంట్లో చూసి రూ.50 వేలు విలువ చేసే (సోనీ కంపెనీ) టీవీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్లు డిపోపై దాడి

- వేయి లీటర్ల కల్లు సీజ్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 25: ఎన్నికల సంఘం నిబంధనలు అతిక్రమించి తెరిచి ఉంచిన కల్లు డిపోపై టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం సాయంత్రం దాడిచేసింది. 25వ తేదీ నుంచి 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు మద్యం విక్రయాలు, కల్లు డిపోలు, కల్లు బట్టీలు బంద్ పాటించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలను అతిక్రమించి కంఠేశ్వర్ ఏరియాలో తెరిచి ఉంచిన డిపోపై టాస్క్‌ఫోర్స ఎస్సై అంజయ్య ఆధ్వర్యంలో దాడిచేసి వేయి లీటర్ల కల్లును సీజ్ చేశారు. డిపో నిర్వాహకుడు బండారు రవిగౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడిని త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై తెలిపారు.

ఆరో టౌనా పరిధిలో బెల్టు షాపు నిర్వహణ

మద్యంస్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 25: నగర శివారులోని ఆరో టౌనా పరిధిలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ దృష్టికి వచ్చిం ది. దీంతో ఆమె ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు మంగళవారం దాడి నిర్వహించాయి. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సిబ్బంది కలిసి బెల్ట్ షాపుపై దాడి చేశారు. 46బీర్లు, 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.18,590 ఉంటుందని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వాహకుడు జె.ప్రణయ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకొని తదుపరి చర్యల నిమిత్తం ఆరో టౌన్ ఎస్సైకి అప్పగించినట్లు తెలిపారు. కాగా.. ఆరో టౌనా పరిధిలో బెల్టు షాపు నిర్వహిస్తున్నా.. సంబంధిత ఎస్‌హెచ్‌వో దృష్టికి ఎందుకు రాలేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.